క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే దంపతుల పరామర్శ



రామకృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వైఎస్సార్ సీపీ అనపర్తి మండల కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు) నాన్నమ్మ సత్తి సూరాయమ్మ ఆదివారం రాత్రి అనపర్తిలో మృతి చెందారు. వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గం కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు సోమవారం ఆ కుటుంబాన్ని, రామకృష్ణారెడ్డిని పరామర్శించారు. ముందుగా సూరాయమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

రంగంపేట: మండలంలోని మర్రిపూడిలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నట్టు సర్పంచ్ వేము మాధవి తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ బోర్లు మరమ్మతుకు గురికావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో గ్రామస్తులు నీటికి ఇబ్బందులు పడకుండా ట్యాంకర్లు ఏర్పాటు చేసి, ఇంటింటికీ నీరు సరఫరా చేస్తున్నామన్నారు. బోర్లకు మరమ్మతులు కూడా చేపట్టడం జరిగిందన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ రుణాల కోసం బ్యాంకు అధికారులు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీవో ఎం.భారతి తెలిపారు. ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీతానగరం వెలమపేటలోని కమ్యూనిటీ హాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

300 మందికి ఇంటర్వ్యూలు

కోరుకొండ: కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం కాపు, బీసీ సామాజిక వర్గాల యువతకు కార్పొరేషన్ రుణాలు అందించడానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్ 9 గ్రామాలకు చెందిన 300 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

ఉపాధి పనులకు వేకువజామునే రావాలి

సీతానగరం: ఉపాధి హామీ పథకం పనులను ఉదయం 5.30 గంటలకే మొదలు పెట్టాలని కూలీలకు ఏపీవో బీఎస్ సత్యవతి సూచించారు. మండలంలోని కాటవరం, బొబ్బిల్లంక గ్రామాలలో పనులను సోమవారం పరిశీలించారు. వేసవి నేపథ్యంలో ఉష్ణోగ్రతలు పెరిగినందున వేకువజామునే పనులు ప్రారంభించాలన్నారు. రూ.307 వేతనం వచ్చేలా ఇచ్చిన కొలతల మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. పనులకు వచ్చే సమయంలో తమ వెంట తాగు నీరు తెచ్చుకోవాలన్నారు.

పశువుల జబ్బులను సకాలంలో గుర్తించాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కోరుకొండ: పశువులకు సోకుతున్న జబ్బులను సకాలంలో గుర్తించి, వాటికి వైద్యసేవలు అందించాలని రాజమహేంద్రవరం వ్యవసాయ కాలేజీ అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు, కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో వ్యవసాయ కాలేజీ విద్యార్థుల ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నాలుగో రోజు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యుడు రాజశేఖర్ మాట్లాడుతూ పశువుల్లో సాధారణంగా వచ్చే జబ్బులను వివరించి, వాటి నివారణ మార్గాలను రైతులకు వివరించారు. కార్యక్ర మంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై రెండు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు అందాయి. రాపాక చెరువు గట్టు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు, తన తండ్రి పేరుపై ఉన్న పట్టాదారు పాస్‌బుక్‌ను తన పేరుపై మార్చాలని కోరుతూ నాగంపల్లికి చెందిన ఏనుగుపల్లి సాంబమూర్తి అర్జీలు ఇచ్చారు. ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ కేవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పల్లెబాట

రాజానగరం: లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పల్లెబాట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమికి సారం.. రైతుకు లాభం

- పచ్చిరొట్టతో పుడమికి మేలు
- సాగుకు ఇదే అదును
- రసాయన ఎరువులు తగ్గించుకునేందుకు మార్గం



రంగంపేటలో సాగు చేస్తున్న నేపియర్ గడ్డి



పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించే జనుము

రంగంపేట: రబీ వరి కోతలు దాదాపు పూర్తి కావస్తున్నాయి. రబీ అనంతరం మూడో పంటగా పలువురు రైతులు అపరాలను పండిస్తుంటే మరికొందరు పచ్చిరొట్టను సాగు చేస్తున్నారు. అన్నిచోట్లా రసాయన ఎరువుల వాడకం విపరీతంగా పెరిగిపోతోంది. ఫలితంగా భూసారం క్షీణిస్తోంది. దీని ప్రభావం మళ్లీ తర్వాత సాగు చేసే పంటలపై పడి దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు దిగుబడులు పెంచుకునేందుకు మరింతగా రసాయన ఎరువులు వాడుతుండటంతో భూసారం మరింతగా తగ్గిపోతోంది. పొలంలో సారం పెంచుకునేందుకు రైతులు రబీ పంటల అనంతరం చేలల్లో పచ్చిరొట్ట పైరును పెంచడం ఎంతో మంచిదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. తద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవడానికి వీలుంటుందంటున్నారు. పచ్చిరొట్ట సాగుకు సంబంధించి పలు విషయాలను వ్యవసాయ అధికారి కె.శ్రీనివాసరావు వివరించారు.

భూమికి బలం

గతంలో రైతులు భూసారం పెరగడానికి పచ్చిరొట్ట పైర్లను రబీ పంటల అనంతరం వేసేవారు. ఇటీవల కాలంలో పచ్చిరొట్ట పైరుల పెంపకం తగ్గిపోయింది. దీని వల్ల భూసారం తగ్గి, పంటలు తెగుళ్ల బారినపడుతున్నాయి. రైతులు తెగుళ్లను అరికట్టడానికి విచ్చలవిడిగా రసాయన మందులు పిచికారీ చేసి అనర్థాలను కొని తెచ్చుకుంటున్నారు. రబీకి, ఖరీఫ్‌కు మధ్యలో పచ్చిరొట్ట పైర్లను పెంచడం వలన భూసారం బాగా పెరుగుతుంది.

స్థూలపోషకాలు అధికం

జనుము, జీలుగ, పిల్లి పెసర, ఉలవ తదితర రకాలను రబీకి, ఖరీఫ్‌కు మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకు పెంచి ఖరీఫ్ పంట వేసేముందు భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం. భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 శాతం నుంచి 2 శాతం వరకు ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. నేలలో సంపూర్ణమైన ఉత్పాదకత పెరుగుతుంది. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికి తీస్తాయి. ఈ పైర్ల సాగు వల్ల 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులు ఆర్థికంగా లాభపడడానికి పచ్చిరొట్ట పైర్లు దోహదం చేస్తాయి. ప్రస్తుతం ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్న పరిస్థితుల్లో పచ్చిరొట్ట పైర్ల సాగు ఎంతో మేలు.

గుళికలతో నష్టం

ఖరీఫ్, రబీ పంటల్లో రైతులు గుళికలను అధికంగా వాడటం వల్ల భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నట్టు శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. గతంలో ఒక గ్రాము మట్టికి కోట్లాది సూక్ష్మజీవులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య లక్షల్లో పడిపోయినట్టు పరిశోధనల్లో తేలుతోంది. పంటల పెరుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశించడం వల్ల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడం వల్ల తిరిగి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సహజంగా చౌడు బారిపోయిన భూముల్లో జీలుగ వేసుకుంటే భూమి భూసారం పెరిగి పంటకు అనుకూలంగా మారుతుంది.

ఇదే సరైన సమయం

అనపర్తి, రాజానగరం నియోజక వర్గాల పరిధిలోని అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో ప్రస్తుతం రబీ కోతలు పూర్తికావస్తుండడంతో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకునేందుకు ఇదే అదును. వరి కోతల అనంతరం చేలల్లో పదును ఉన్న సమయంలోనే పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే భూసారానికి ఎంతో మేలు చేకూరుతుంది.

పచ్చిరొట్ట ఎరువులు వేయాలి



రైతులు రబీ, ఖరీఫ్ సీజన్ల మధ్యలో తమ పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసుకోవాలి. దీనివల్ల భూసారం పెరిగి పంటలు అధిక దిగుబడులు రావడానికి దోహదం అవుతుంది. ప్రస్తుతం రబీ కోతలు ముగింపు దశకు చేరుకోవడంతో పంట కోసిన వెంటనే పదునుపై పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలి. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

– కె.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట

అంబేడ్కర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నీ ప్రారంభంలో పాల్గొన్న వీరబాబు తదితరులు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లలో అంబేడ్కర్ యూత్, మట్టాడి వెంకట రమణ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభమైంది. ఈ గ్రామంలోని గోదారమ్మ తల్లి విగ్రహం సమీపంలో ఈ టోర్నీ జరుగుతోంది. దీనిలో నియోజకవర్గంలోని 32 క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయని, ఈ నెల 14 వరకూ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు పాల్గొని, నిర్వహణకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కాగా.. లంకూరు టీమ్‌పై వంగలపూడి, కాటవరంపై సీతానగరం, లంకూరుపై ఇనుగంటివారిపేట విజయం సాధించాయి.

అన్నసమారాధన

పెదపూడి: కరకదురు బీసీ కాలనీలోని సీతారామ చంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా ఆలయంలో రాముడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనకు స్థానికులతో పాటు దోమాడ, ఏపీత్రయం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అన్న ప్రసాదం స్వీకరించారు.

వ్యసనాల కోసం నేరాల బాట

- 21 కేజీల గంజాయితో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ విద్య



నిందితుడితో డీఎస్పీ విద్య తదితరులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు తూర్పు శివారు జగనన్న కాలనీ లేఅవుట్ 2 సమీపంలోని సీతారామచెరువుకు వెళ్లే దారి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో 21.080 కేజీల గంజాయితో మురుకుత్తి సూర్యప్రకాష్‌ను అరెస్టు చేసినట్లు రాజమహేంద్రవరం డీఎస్పీ బి.విద్య తెలిపారు. ఆమె సోమవారం రాత్రి బిక్కవోలు పోలీస్ స్టేషన్ వద్ద విలేకర్లతో సమావేశం నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని చికెన్ సెంటర్‌లో మురుకుత్తి సూర్య ప్రకాష్ పనిచేసేవాడు. అక్కడ అతడి బావతో గొడవ పడి కాకినాడ జిల్లా ఉప్పాడలోని చికెన్ షాప్‌లో పనికుదిరాడు. కానీ వచ్చే సంపాదన అవసరాలకు, వ్యసనాలకు సరిపోయేది కాదు. దీంతో అక్కడ పాత నేరస్తులైన ఆవాల మణికంత, తొలుం రాజు పరిచయమ్యారు. ఈ ముగ్గురూ కలిసి మార్చి మొదటి వారంలో బిక్కవోలులో రెండు బైకులను చోరీ చేశారు. ప్రకాష్ తన వాటాగా వచ్చిన బైకుతో అప్పటికే ఇన్స్టాగ్రామ్‌లో పరిచయం అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండల కె.పెదబయలు గ్రామానికి చెందిన వంతల పంతులు బాబు అలియాస్ గౌతమ్ వద్దకు వెళ్లాడు. అతడికి బైక్ ఇచ్చి, 21 కేజీల గంజాయిని తీసుకుని బిక్కవోలు వచ్చారు. బిక్కవోలు పరిసర ప్రాంతంలో విక్రయించాలని అనుకునే సమయంలో ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తన సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. గంజాయితో పాటు బైకు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు గౌతమి పరారయ్యాడు. సమావేశంలో సీఐ వీఎల్‌వీకే సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

భూమి సమస్యను తక్షణమే పరిష్కరించాలి

బిక్కవోలు: కాపవరం పంచాయతీ పరిధిలో ఆక్రమణకు గురైన అసైన్డ్ భూమి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం బిక్కవోలు మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణ వినతి పత్రం అందించారు. రాజబాబు మాట్లాడుతూ కాపవరం గ్రామంలోని సర్వే 150లో సుమారు 5 ఎకరాల భూమిని బలభద్రపురం గ్రామానికి చెందిన ముద్దా మంగన 1983లో ప్రభుత్వం అసైన్డ్ చేసిందన్నారు. ఆ భూమిని కొందరు ఆక్రమణ చేశారన్నారు. వాటి వెంటనే మంగన వారసులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ నాయకులు రామలింగేశ్వరరావు, బొచ్చ ఏసు, దేశెట్టి సురేష్, బి.శ్రీనివాస్, రత్నరాజు, వీరలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పెదపూడిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాఘవులు తదితరులు

పెదపూడి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర నాయకుడు రాగులు రాఘవులు అన్నారు. పెదపూడిలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఐఎఫ్‌టీయూ అనుబంధంగా ఉన్న పంచాయతీ కార్మిక సంఘం కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. రాఘవులు మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ పంచాయతీలోని వారికి కనీస వేతనాలు అమలు చేయకుండా, ఒక్కో పంచాయతీలో ఒక్కో విధంగా జీతాలు ఇస్తూ, బానిసలుగా చూస్తున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ పీవీ సీతాపతిరావుకు వినతిపత్రం అందజేశారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



మహిళలతో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసేవిధానంపై సోమవారం కుమారప్రియం గ్రామం విద్యార్థులు, మహిళలకు అవగాహన కల్పించారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తడి, పొడి చెత్తను క్లాప్ మిత్రలకు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బిరద వీర వెంకట సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శి సుంకర వీరస్వామి నాయుడు, చొడిశెట్టి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి

రంగంపేట: తమ వ్యవసాయ బోర్లకు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలని కోరుతూ రైతులు రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దొడ్డిగుంట గ్రామంలో జలకళ పథకంలో తమకు వ్యవసాయ బోర్లు మంజూరు కావడంతో బోర్లు వేయించుకున్నామన్నారు. అయితే అన్ని పనులు పూర్తయినా విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయన్నారు. దీనిపై విద్యుత్తు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జలకళ బోర్లు వేసిన కాంట్రాక్టర్లు రామయ్య, కాపవరం డ్రిల్ మేస్త్రి నాని నుంచి తమకు డబ్బులు రావాల్సి ఉందని తమ సొమ్ము తమకు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

డివైడర్ ఏర్పాటు చేయాలని వినతి



జేసీ చిన్నరాముడుకు వినతి పత్రం అందిస్తున్న గోవిందరాజు

రంగంపేట: పెదరాయవరం వద్ద ఏడీబీ రోడ్డుపై డివైడర్ ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ చిన్నరాముడును కోరినట్టు వైఎస్సార్ సీపీ అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు తెలిపారు. రాజమహేంద్రవరంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశామన్నారు. ఆయన మాట్లాడుతూ ఏడీబీ రోడ్డు విస్తరణలో భాగంగా ప్రస్తుతం పెదరాయవరం వద్ద రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అయితే డివైడర్ ఏర్పాటు చేయకుండా రోడ్డు వేస్తున్నారన్నారు. గ్రామంలోని సుమారు 3 వేల మంది గ్రామస్తులు స్థానిక జిల్లా పరిషత్ రోడ్డు మీదుగా ఏడీబీ రోడ్డుకు ప్రయాణం చేయాలన్నారు. అంతే కాకుండా ఏడీబీ రోడ్డుకు అవతల వైపు కూడా పెదరాయవరం గ్రామానికి చెందిన 500 ఎకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. కావున తప్పని సరిగా డివైడర్ ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంటా సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

256 మందికి వైద్య సేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్

సీతానగరం: స్థానిక కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో రామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో సోమవారం సాధారణ, కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. డాక్టర్లు యన్నమనేని రామచంద్రరావు, రాయుడు శ్రీనివాస్, సత్యం రమేష్‌బాబు సుమారు 256 మందికి వైద్యసేవలు అందించారు. సాధారణ శిబిరంలో 184 మంది, కంటి వైద్యశిబిరంలో 72 మందికి పరీక్షలు జరిపారు. 13 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని ఉచిత ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, వై.వెంకట నారాయణ, కె శ్రీనివాస్, చంటిబాబు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న నన్నయ అధికారులు

రాజానగరం: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'దేశ నిర్మాణంలో యువత పాత్ర' అనే అంశం పై సోమవారం మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బిడ్డల్ని చూసి తల్లిదండ్రులు గర్వపడటం, చదువుకున్న విద్యా సంస్థకే ముఖ్యఅతిథులుగా రావడం, మీరు పెట్టే సంతకాలు ఆటోగ్రాఫ్‌లుగా మారడం వంటి మూడు లక్ష్యాలను యువత లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. అయితే నేటి యువత సెల్‌ఫోన్లతో బిజీ లైఫ్‌ను గడపడమే కాకుండా రీల్స్, షాట్స్ చూస్తూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెక్నాలజీని అభివృద్ధి కోసం ఉపయోగించాలని, పతనం అయ్యేందుకు కాదన్నారు. అనంతరం ఆయనను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు సన్మానించారు.

కబడ్డీ పోటీల విజేతగా పీఆర్ కాలేజీ



ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలో ఉగాది రోజు ప్రారంభమైన పీకేఎల్ 4 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. పందలపాక యూత్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల విజేతగా కాకినాడకు చెందిన పీఆర్ కాలేజీ నిలిచింది. వారికి పందలపాక టీడీపీ సమకూర్చిన నగదును స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బహుమతితో పాటు రూ.33,333 చెక్కు అందించారు. ద్వితీయ బహుమతిగా వైఎస్సార్‌సీపీ సమకూర్చిన నగదును ఎస్‌పీఎల్ఎల్ జట్టుకు బహుమతి పాటు రూ.15,555 చెక్కును పందలపాక అప్పారావు సన్స్ అందించారు. మూడో బహుమతిగా రూ.6,666 చెక్కును ఐడియల్ కాలేజీకి శీరం దుర్గాప్రసాద్, నాలుగో బహుమతిగా రూ.2,222 మెళ్లూరు – బోగాది వెంకటరమణ అందించారు.

పందలపాక అప్పారావుకు సత్కారం



అప్పారావును సత్కరిస్తున్న పందలపాక యూత్ సభ్యులు

బిక్కవోలు: పందలపాకలోని సరిపల్లి పేట మార్కెట్ వద్ద పందలపాక అప్పారావును ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. పలావు అమ్మకం ద్వారా ఆయన పందలపాక గ్రామానికి ఎంతో పేరు తీసుకువస్తున్నారని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో పందలపాక బిర్యానీ అంటే తెలియని వారు ఉండరన్నారు. అనపర్తి, మండపేట వెలమ సంఘ అధ్యక్షుడు కర్రి శ్రీను మాట్లాడుతూ అప్పారావు వల్ల మన ప్రాంత ప్రజలకు మంచి పేరు వచ్చిందన్నారు.